సాక్షి
చిత్తూరు
శనివారం । 4 । ఫిబ్రవరి । 2023



చిత్తూరు బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.55,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,400
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.72,000
రిటైల్ వెండి గ్రాము	రూ.75

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	32	18
తిరుపతి	32	18
తిరుమల	28	14
గూడూరు	33	20
నగరి	33	18



శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. తిరుమలలో 14 కంపార్టుమెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 60,609 మంది స్వామివారిని దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

లోకేష్ పాదయాత్ర ఆ పార్టీకి పాడె యాత్ర

–డిప్యూటీ సీఎం నారాయణస్వామి



పెనుమూరు(కార్వేటినగరం): ప్రజాప్రతినిధిగా కూడా గెలవలేని లోకేష్ చేస్తున్న పాదయాత్ర టీడీపీకి పాడె యాత్రేనని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కొత్త రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వార్డు మెంబర్‌గా కూడా గెలవలేని లోకేష్ ప్రజలను మభ్యపెట్టేందుకు చేస్తున్న పాద యాత్ర ఆఖరికి ఆ పార్టీకి పాడె యాత్రగా మిగిలి పోవడం ఖాయమన్నారు. చంద్రబాబు ఒక 420 అయితే లోకేష్ 210 అని ఎద్దేవాచేశారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఇద్దరూ కలిసి పోటీచేసినా, విడివిడిగా పోటీ చేసినా అభ్యంతరం లేదని తెలిపారు.

స్థానిక సంస్థల్లో పదవుల భర్తీ

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో ఖాళీగా ఉన్న స్థానిక సంస్థల పదవుల భర్తీకి శుక్రవారం ఎన్నికలు నిర్వహించారు. ఈ మేరకు జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. పూతలపట్టు వైస్ ఎంపీపీగా వి.ద్వారకనాథ్‌రెడ్డి , కలికిరి వైస్ ఎంపీపీగా వి.శ్రీకాంత్, శాంతిపురం మండలంల రాళ్లబూదుగూరు ఉప సర్పంచ్‌గా గాజుల వెంకటరమణ ఎన్నికైనట్లు తెలిపారు. చిత్తూరు మండల కో–ఆప్షన్ సభ్యుడి ఎంపికకు నామినేషన్ దాఖలు కాలేదని వివరించారు.

వరసిద్ధుని హుండీ లెక్కింపు



లెక్కింపును పరిశీలిస్తున్న మోహన్ రెడ్డి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి హుండీ లెక్కింపును ఆలయ ఆస్థాన మండపంలో శుక్రవారం చేపట్టారు. మొత్తం 15 రోజులకు గాను స్వామివారికి కానుకల రూపేణా హుండీ ద్వారా బంగారం 50 గ్రాములు, వెండి 1.3 కిలోలతో కలిపి రూ.99 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓలు ఎస్వీ కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, విద్యాసాగర్ రెడ్డి, హరిమాధవ రెడ్డి, హేమమాలిని, పర్యవేక్షకులు శ్రీధర్‌బాబు, కోదండపాణి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నిక వాయిదా

రామకుప్పం: మండలంలో ఎంపీపీ, రెండో వైస్ ఎంపీపీ ఎన్నికను శుక్రవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ హాలులో ఎన్నికల అధికారి పురుషోత్తం ఆధ్వర్యంలో నిర్వహించారు. అయితే మండలంలోని ఎంపీటీసీ సభ్యులు సమావేశానికి హాజరుకాలేదు. దీంతో ఎన్నికను మరోసారి వాయిదా వేసి నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు ఎన్నికల అధికారి చెప్పారు. ఇప్పటివరకు ఎంపీపీగా ఉన్న సుబ్రమణ్యం పదవిలో కొనసాగనున్నారు.

ఇం'ధనం పక్కదారి'!

అదను దొరికితే చాలు అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. కాసుల కోసం నిబంధనలు తుంగలో తొక్కేస్తున్నారు. ఇసుక.. ఎర్రచందనం.. మద్యం స్మగ్లింగ్‌కు తోడుగా ఇప్పుడు డీజిల్ అక్రమ రవాణాకు తెరతీసేశారు.. ఎలాంటి సుంకం చెల్లించకుండా కర్ణాటక నుంచి జిల్లాకు తీసుకువస్తున్నారు. నిత్యం వందలాది ట్యాంకర్ల ద్వారా వేలాది లీటర్ల డీజిల్‌ను తరలించుకువస్తున్నారు. జిల్లాలో ముమ్మరంగా సాగుతున్న రహదారుల నిర్మాణాన్నే ఆదాయ వనరుగా మార్చుకున్నారు. రోడ్డు పనులకు గ్రావెల్, మట్టి తోలుతున్న టిప్పర్లకు నకిలీ బిల్లులతో ఇంధనం సరఫరా చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వ ఖజానాకు యథేచ్ఛగా రూ.కోట్లలో గండి కొట్టేస్తున్నారు.

- కర్ణాటక నుంచి నిత్యం జిల్లాకు వస్తున్న వేల లీటర్ల డీజిల్
- వందలాది ట్యాంకర్లతో అక్రమ రవాణా
- నకిలీ బిల్లులతో పన్ను చెల్లించకుండా తరలింపు
- ప్రభుత్వ ఖజానాకు భారీ గండి
- తూతూమంత్రంగా అధికారుల నిఘా

చిత్తూరు అర్బన్ : జిల్లావ్యాప్తంగా అభివృద్ధి పనులు సాగుతున్నాయి. ముఖ్యంగా జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్ హైవేలు, రాష్ట్ర రహదారుల పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ పనులకు ఇసుక, కంకర రవాణా చేసేందుకు నిత్యం వందల సంఖ్యలో టిప్పర్లు తిరుగుతున్నాయి. ఇక్కడ వరకు అంతా బాగానే ఉన్నా.. ఈ టిప్పర్లకు రోజూ వేలాది లీటర్ల డీజిల్ కావాల్సి ఉంటుంది. ఇదే అదనుగా పలువురు అక్రమార్కులు డీజిల్ స్మగ్లింగ్‌కు తెరతీశారు. కాసులు మిగుల్చుకోవచ్చని



డీజిల్ తరలిస్తూ పట్టుబడిన ట్యాంకర్ (ఫైల్)

కాంట్రాక్టర్లకు ఆశజూపి కర్ణాటక నుంచి తీసుకువచ్చిన ఇంధనం విక్రయిస్తున్నారు.

భారీగా దిగుమతి..

మన రాష్ట్రం కంటే కర్ణాటకలో డీజిల్ ధర కాస్త తక్కువగా ఉంది. ఎక్సైజ్ సుంకం కారణంగానే ఈ వ్యత్యాసం వచ్చింది. అయితే అక్కడి నుంచి డీజిల్‌ను ఇక్కడకు తీసుకురావాలంటే తప్పనిసరిగా పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అప్పుడు రెండు ప్రాంతాల్లోనూ రేటు సమానమవుతుంది. కానీ, కొందరు స్మగ్లర్లు నకిలీ బిల్లులు సృష్టించి రోజూ వేలాది లీటర్ల డీజిల్‌ను జిల్లాకు తీసుకువస్తున్నారు. ఒక్కో ట్యాంకర్‌లో సుమారు 10వేల లీటర్ల చొప్పున 50 నుంచి 100 వాహనాల్లో సరిహద్దు దాటించి తీసుకొచ్చేస్తున్నారు. అధికారుల అలసత్వం కూడా అక్రమార్కులకు సహకరిస్తోంది. తూతూ మంత్రంగా చేపట్టిన తనిఖీలను అధిగమించేందుకు స్మగ్లర్లు పెద్దగా ప్రయాసపడాల్సిన అవసరం కూడా లేకుండా పోయింది. నిజానికి ఈ వాహనాలు తనిఖీల్లో పట్టుబడితే ఒక్కో ట్యాంకర్‌కు 10 వేల లీటర్లు తెచ్చినందుకు రూ.2 లక్షల వరకు అపరాధ రుసుము విధించాల్సి ఉంటుంది. అయితే కొందరు అధికారులు మామూళ్ల మత్తులో జోగుతుండడంతో నెలకు రూ.కోట్లలో ప్రభుత్వ ఖజానాకు గండి పడుతోంది.

లోపించిన నిఘా!

డీజిల్ స్మగ్లింగ్‌ను అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వాణిజ్య పన్నులు, పోలీసుశాఖలపై ఈ స్మగ్లింగ్ అరికట్టాల్సిన బాధ్యత ఉంది. ఎప్పుడో మూడు నెలలకోసారి రెండు ట్యాంకర్ల డీజిల్‌ను సీజ్ చేసి అపరాధ రుసుము కట్టించి చేతులు దులిపేసుకుటున్నారు. ముఖ్యంగా వాణిజ్య పన్నులశాఖలోని నిఘా వ్యవస్థ బలహీనంగా ఉంది. ఇక పోలీసుశాఖలో నెలసరి మామూళ్లు తీసుకునే ఒకరిద్దరు అధికారులు అక్రమార్కులకు రెడ్ కార్పెట్ పరుస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇదే అదును..

జిల్లాలో ప్రస్తుతం జరుగుతున్న బెంగళూరు–చెన్నై ఎక్స్‌ప్రెస్ వే, చిత్తూరు–తచ్చూరు ఎక్స్‌ప్రెస్ వే పనులు జరుగుతున్నాయి. దాదాపు 800 వరకు టిప్పర్లు పనిచేస్తున్నాయి. వీటికి రోజూ 20 వేల లీటర్ల వరకు డీజిల్ అవసరం. కొందరు బడా వ్యక్తులు పలుకుబడిని ఉపయోగించి కర్ణాటక నుంచి డీజిల్ తెప్పించుకుంటున్నారు. దీంతో ప్రభుత్వం ఆదాయం కోల్పోతోంది. ప్రధానంగా చిత్తూరు–కోలార్, చిత్తూరు–గుడియాత్తం, చిత్తూరు–పొన్నై, చిత్తూరు–కాట్పాడి మార్గాల నుంచి డీజిల్‌ను తీసుకొచ్చి జిల్లాలోకి డంప్ చేస్తున్నారు.

తనిఖీలు ముమ్మరం చేస్తాం..



డీజిల్ స్మగ్లింగ్‌ను అరికట్టడంపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తాం. ప్రధానంగా అంతర్రాష్ట్ర సరిహద్దుల వద్ద నిఘా పెంచుతాం. వాణిజ్య పన్నుల శాఖతో కలిసి ప్రత్యేక దాడులు చేసే విషయాన్ని కూడా పరిశీలిస్తాం. స్మగ్లర్లపై చట్టరీత్యా కఠినంగా వ్యవహరించి, ఉక్కుపాదం మోపుతాం.

– వై.రిషాంత్‌రెడ్డి, ఎస్పీ, చిత్తూరు

విదేశీ విద్యకు 'దీవెన'



మెగాచెక్కును పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

- తొలివిడతగా రూ.16.06 లక్షల సాయం
- కలెక్టరేట్‌లో ఘనంగా జగనన్న విదేశీ విద్యదీవెన జిల్లాస్థాయి కార్యక్రమం
- హాజరైన జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే, మేయర్, కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్ : పేదలు సైతం విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు ప్రభుత్వం సహకరిస్తోంది. అందులో భాగంగా జగనన్న విదేశీ విద్యాదీవెన పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ మేరకు శుక్రవారం తాడేపల్లె క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాదీవెన లబ్ధిదారుల ఖాతాల్లో బటన్ నొక్కి నగదు జమ చేశారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద, కలెక్టర్ హరనారాయణన్ పాల్గొన్నారు. జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిభకు పెద్ద పీట వేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన పేద విద్యార్థుల కోసం జగనన్న విదేశీ విద్యాదీవెన పథకాన్ని పారదర్శకంగా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. కలెక్టర్ హరి నారాయణన్ మాట్లాడుతూ విదేశీ విద్యాదీవెనకు జిల్లా నుంచి ముగ్గురు ఎంపికై నట్లు చెప్పారు. వారికి మొత్తం రూ.78.01 లక్షలు మంజూరు చేసినట్లు వెల్లడించారు. అందులో తొలి విడతగా నేడు రూ.16.06 లక్షలు విడుదల చేసినట్లు తెలిపారు. పలమనేరు నియోజకవర్గం గంగవరం మండలం కీలపట్ల పంచాయతీ మాదిగపల్లెకు చెందిన పి.చందన అనే విద్యార్థిని కజకిస్థాన్‌లోని అల్ ఫరాభి కజఖ్ యూనివర్సిటీలో ఎంబీబీఎస్ చదువుకునేందుకు ప్రభుత్వం రూ.24లక్షలు మంజూరు చేయగా, మొదటి విడత కింద రూ.6లక్షలు అందించామన్నారు. పుంగనూరు నియోజకవర్గం సోమలకు చెందిన గీతిక యూనివర్సిటీ ఆఫ్ మేరీ ల్యాండ్‌లో విద్యాభ్యాసానికి రూ. 26.46 లక్షలు ఖర్చు కానుండగా తొలివిడతగా రూ. 6.61 లక్షలు, రామకుప్పం మండలానికి చెందిన లోకేష్‌కు యునివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో రూ .27.54 లక్షలు ఖర్చు కానుండగా అందులో ముందు రూ.3.44 లక్షలు అందిస్తున్నట్లు వివరించారు. ఈ సొమ్ము ఆయా విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమ చేశారు. అనంతరం మెగా చెక్కును పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ కర్నూల్ రీజియన్ చైర్‌పర్సన్ శైలజారెడ్డి, బీసీ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీలు రబ్బానీ బాషా, రాజ్యలక్ష్మి , మూర్తి పాల్గొన్నారు.

ఉనికి కోసమే లోకేష్ ఫీట్లు

- జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: యువగళం పేరుతో చేపట్టిన పాదయాత్ర ఫ్లాప్ కావడంతో ఉక్రోషం పట్టలేక మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై అసత్య ఆరోపణలు గుప్పిస్తూ, ఉనికి కోసం లోకేష్ నానా పాట్లు పడుతున్నారని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు విమర్శించారు. శుక్రవారం జెడ్పీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. లోకేష్ పాదయాత్రలో 300 మంది ఆయన వ్యక్తిగత సైన్యం తప్ప ప్రజలు కనీసం వంద మంది కూడా లేరని ఎద్దేవా చేశారు. కానీ ఎల్లోమీడియాలో మార్ఫింగ్ ఫొటోలు వేసి మైలేజీ తీసుకువచ్చేందుకు తాపత్రయపడుతున్నారని ఆరోపించారు. గత టీడీపీ ప్రభుత్వంలో నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి విచ్చలవిడిగా ఎర్రచందనం స్మగ్లింగ్ చేయించారని స్పష్టం చేశారు. అప్పట్లో ఇసుక మాఫియాను అడ్డుకోబోయినందుకు టీడీపీ నేత చింతమనేని ప్రభాకర్ దౌర్జన్యానికి పాల్పడి దాడికి దిగారని గుర్తుచేశారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సంపూర్ణ మద్యనిషేధం అమలు చేస్తే, చంద్రబాబు అధికారంలోకి



రాగానే తీసేసిన విషయాన్ని లోకేష్ మర్చిపోయినట్లున్నారని మండిపడ్డారు. చంద్రబాబు విస్మరించిన హంద్రీ–నీవా, గాలేరు–నగరి, తెలుగుగంగ ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యమిస్తున్నారని తెలిపారు. జిల్లాలో జాతీయ రహదారులు, పట్టణ, గ్రామీణ రహదారుల నిర్మాణం శరవేగంగా సాగుతోందని వెల్లడించారు. ఇవన్నీ కప్పిపుచ్చేందుకు మంత్రి పెద్దిరెడ్డిపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించే ప్రసక్తే లేదన్నారు. 2014లో వైఎస్సార్‌సీపీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన అమరనాథరెడ్డి కేవలం మంత్రి పదవి కోసం పార్టీ ఫిరాయించారని, ఆయనపై ప్రజలకు విశ్వాసం లేదని చెప్పారు. పొరుగు రాష్ట్రాలు, జిల్లాల నుంచి పెయిడ్ ఆర్టిస్టులను తీసుకువచ్చి పాదయాత్ర కొనసాగిస్తున్నారని, వారిని చూసి ప్రభుత్వానికి ఎందుకు వణుకు పుడుతుందని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో సైతం జగనన్న వెంటే జనం నడుస్తారని స్పష్టం చేశారు.

పేదల అభ్యున్నతికే ప్రాధాన్యం



గర్భిణులను ఆశీర్వదిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నేతలు

- ఇంటి ముంగిటకే ప్రభుత్వ పథకాలు
- విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల : పేదల అభ్యున్నతికే తొలి ప్రాధాన్యమిస్తున్నట్లు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని గానుగచింత, మోటుమల్లెల, బోడిపాటివారిపల్లె పంచాయతీల్లో నిర్వహించిన పల్లెబాటలో ఆయన పాల్గొన్నారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ ప్రజల ఇంటి ముంగిటకే ప్రభుత్వ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు చేరుస్తున్నామని వెల్లడించారు. ఉద్యోగులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా గానుగచింత పంచాయతీలో పల్లెబాట కార్యక్రమంపై ఎవరికీ సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యం చూపిన ఏపీఎం బ్రహ్మానందరెడ్డి, సీపీ నాగరాజాను సస్పెండ్ చేయాలని పీడీని ఆదేశించారు. ప్రజాసేవే పరమావధిగా అహర్నిశలు కృషి చేస్తుంటే, కొందరు అధికారుల వైఖరి కారణంగా ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోందని మండిపడ్డారు. సక్రమంగా ఈ–క్రాప్ నమోదు చేయకుండా రైతులను నష్టపరచిన మోటుమల్లెల ఆర్‌బీకే సహాయకుడు నరసింహులుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 15 రోజుల్లో రైతులకు న్యాయం చేయకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం గొల్లపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో సీమంతం కార్యక్రమానికి హాజరై గర్భిణులను ఆశీర్వదించారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేతలు

మోటుమల్లెల పంచాయతీ వంకిరెడ్డిగారిపల్లెకు చెందిన టీడీపీ నేతలు చెన్నూరు సుబ్బరామయ్య, జయమ్మ, కోమ్మేవాండ్లపల్లెకు చెందిన గోవిందరెడ్డి, లక్ష్మీదేవి వైఎస్సార్‌సీపీలో చేరారు. మంత్రి పెద్దిరెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీలో చేరిన నేతలు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నేతృత్వంలో అభివృద్ధి పరుగులు తీస్తోందన్నారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కష్టపడి పని చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తంరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్‌రెడ్డి, సర్పంచ్ ఇబ్రహీంఖాన్, హేమలత, ఎంపీటీసీ సభ్యులు రమణమ్మ, విజయశేఖర్, ఎంపీడీఓ రాజేంద్ర, ఇన్‌చార్జి తహసీల్దార్ అమరనాథ్, సీఐ ఆశీర్వాదం, ఎస్‌ఐలు శ్రీనివాస్, రవిప్రకాష్‌రెడ్డి, స్థానిక నేతలు జయరామయ్య, బాబు, రాసారాయ నాయుడు, కమలాపురం శ్రీదేవిరెడ్డి, విమల, గిరిజమ్మ పాల్గొన్నారు.

వినాయకస్వామి సేవలో మంత్రి పెద్దిరెడ్డి



పూజాసామగ్రి తీసుకువస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారిని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. ఆయనకు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, ఆలయ కమిటీ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం చేయించారు. వేదపండితులు ఆశీర్వదించారు. అనంతరం జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందించినట్లు మంత్రికి విన్నవించారు. మంత్రి మాట్లాడుతూ ఆలయాభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ జగన్నాథరెడ్డి పాల్గొన్నారు.

ప్రజల ఆర్థికాభివృద్ధికే 'నవరత్నాలు'

- రాష్ట్ర ప్రణాళిక విభాగం కార్యదర్శి విజయ్‌కుమార్

సాక్షి, చిత్తూరు : ప్రజల ఆర్థికాభివృద్ధికే ప్రభుత్వం నవరత్నాలు అమలు చేస్తున్నట్లు రాష్ట్ర ప్రణాళికా విభాగం కార్యదర్శి విజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం జిల్లా సచివాలయంలో కలెక్టర్‌తో కలసి అధికారులతో సమావేశమయ్యారు. సుస్థిర అభివృద్ధి, లక్ష్యాల సాధన, స్పందన, గడప గడపకు మన ప్రభుత్వం, ఎంపీ నిధుల వినియోగం తదితర అంశాలపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ పేదల జీవన స్థితిగతులను మార్చేందుకే సంక్షేమ పథకాలను ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. విద్య, వైద్యరంగాలను అత్యున్నతంగా తీర్చిదిద్దుతోందని వెల్లడించారు. గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత, చిన్నారుల్లో ఎదుగుదల లోపం, బరువులేకపోవడం తదితర సమస్యలను అరికట్టేందుకే వైఎస్సార్‌సీ



మాట్లాడుతున్న ప్రభుత్వ కార్యదర్శి విజయ్ కుమార్

సంపూర్ణ పోషణ కిట్‌లు అందిస్తున్నట్లు వివరించారు. బడి బయటి పిల్లలను పాఠశాలలో చేర్పించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. స్పందనలో వచ్చిన అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి అధిక ప్రాధాన్యమివ్వాలని ఆదేశించారు. ఎంపీ నిధులతో ప్రారంభించిన పనులను వేగవంతం చేయాలని కోరారు. అనంతరం కలెక్టర్ హరినారాయణన్ మాట్లాడుతూ జిల్లాలో లక్ష్యాల సాధనకు అన్నిశాఖల సమన్వయంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పకడ్బందీగా పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నామన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కింద గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలందిస్తున్నట్లు వెల్లడించారు. గడప గడపకు కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు గుర్తించిన అభివృద్ధి పనులకు అనుమతుల రాగానే మంజూరు చేస్తున్నట్లు వివరించారు. స్పందన సమస్యలను నిర్దేశిత గడువులో పూర్తిచేసేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జేసీ ఎస్.వెంకటేశ్వర్, అడిషనల్ ఎస్పీ జగదీష్, డీఆర్‌ఓ రాజశేఖర్, ఎస్‌ఈలు దేవానందం , చంద్రశేఖర్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ ప్రకాశం, డీసీహెచ్‌ఎస్ నాయక్, డీఆర్‌డీఏ, డ్వామా పీడీలు తులసి, గంగా భవాని, సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి, డీఈఓ విజయేంద్ర రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ నాగజ్యోతి, సీపీఓ ఉమాదేవి, ఐసీడీఎస్ పీడీ నాగశైలజ పాల్గొన్నారు.

ఆరోపణలు నిరూపిస్తే రాజీనామా

- ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు/వి.కోట : పాదయాత్రలో లోకేష్ తనపై చేసిన ఆరోపణలను నిరూపిస్తే వెంటనే పదవికి రాజీనామా చేసి, శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటానని ఎమ్మెల్యే వెంకటేగౌడ సవాల్ విసిరారు. శుక్రవారం వి.కోటలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. యువగళం పేరుతో ఆపసోపాలు పడుతున్నా ప్రజలు పట్టించుకోకపోవడంతో వచ్చిన ఫ్రస్టేషన్‌లో లోకేష్ నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రెండెకరాల ఆసామి చంద్రబాబు ఇప్పుడు రూ.వేల కోట్లకు ఎలా అధిపతి అయ్యారో అందరికీ తెలుసన్నారు. పదవుల కోసం పార్టీలు మారే అమరనాథరెడ్డిని పులి అనడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. లోకేష్ పాలిటిక్స్‌కు పనికిరాడని జనం విశ్వసిస్తున్నారని, ఎల్లోమీడియా ఎన్ని జాకీలు వేసి లేపినా ప్రయోజనం ఉండదని స్పష్టం చేశారు. పలమనేరులో ప్రజలు వలస పోతున్నారంటూ ప్రచారం చేస్తున్నారని, చంద్రబాబు ప్రాతినిథ్యం వహిస్తున్న కుప్పం నుంచి నిత్యం పదివేల మందికి వరకు బెంగళూరుకు వెళుతున్నారని గుర్తుచేశారు. ముందు అక్కడి జనాలకు ఉపాధి కల్పించి వలసలను అడ్డుకోవాలని హితవు పలికారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దెబ్బ ఎలా ఉంటుందో చంద్రబాబును అడిగి లోకేష్ తెలుసుకోవాలని సూచించారు. స్థానిక ఎన్నికల్లో తండ్రీ కొడుకులు కుప్పం వీధులన్నీ తిరిగినా చిత్తుగా ఓడించిన ఘనత మంత్రి పెద్దిరెడ్డికే దక్కుతుందన్నారు. 2014 ఎన్నికల్లో జగనన్న బొమ్మతో గెలిచిన అమరనాథరెడ్డి ,2019 ఎన్నికల్లో ఇలాగే తొడగొట్టి 32వేల ఓట్లతో సామాన్యుడి చేతిలో ఓడిపోయిన విషయం గుర్తుంచుకోవాలని చెప్పారు. మళ్లీ తొడగొడితే వచ్చే ఎన్నికల్లో సీన్ రిపీట్ అవుతుందన్నారు. అమరనాథరెడ్డి మంత్రిగా ఉన్నప్పుడు రూ.కోట్లు కొల్లగొట్టారని ఆరోపించారు. ఆయన మోసాలను పలమనేరు ప్రజలను ఎన్నటికీ క్షమించరని స్పష్టం చేశారు. సమావేశంలో ఎంపీపీ యువరాజ్, పార్టీ మండల కన్వీనర్ బాలగురునాథ్, స్థానిక నేత గౌస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

చేనేతకు చేయూత కోసం వినతి

నగరి : నియోజకవర్గంలోని చేనేత పరిశ్రమకు చేయూతనందించాలని తమిళనాడు మంత్రి గాంధీకి మంత్రి ఆర్‌కే రోజా విన్నవించారు. శుక్రవారం తిరుమల శ్రీవారి దర్శనానికి విచ్చేసిన మంత్రి గాంధీ తిరుగుప్రయాణంలో మంత్రి రోజాను నగరిలోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేత పరిశ్రమపై ఆధారపడి వేలాదిమంది జీవనం సాగిస్తున్నారని, వారు తమిళనాడులోని టెక్స్‌టైల్ రంగంపై ఎక్కువగా ఆధారపడి ఉన్నారని వెల్లడించారు. నేతన్నలను ప్రోత్సహించేందుకు ఎంఎస్‌ఎంఈ పురంలో టెక్స్‌టైల్ పరిశ్రమ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే విజయపురం మండలం, కోసలనగరంలో సెజ్‌కు శ్రీకారం చుట్టామన్నారు. అక్కడ



తమిళనాడు మంత్రికి స్వాగతం పలుకుతున్న మంత్రి రోజా

పరిశ్రమలు స్థాపించేందుకు తమిళనాడు ప్రభుత్వం సహకరించాలని కోరారు. దీనిపై మంత్రి గాంధీ సానుకూలంగా స్పందించారు. వాలాజా చైర్మన్ వినోద్, రాజగోపాలరెడ్డి పాల్గొన్నారు.

తొడగొడితే మళ్లీ భంగపాటే!



మాట్లాడుతున్న ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప

బైరెడ్డిపల్లె : మాజీ మంత్రి అమరనాథరెడ్డి 2019 ఎన్నికల్లో తొడగొడితే ప్రజలు 32వేల ఓట్ల తేడాతో ఓడించారని, ఇప్పుడు తొడగొడితే మళ్లీ భంగపాటు తప్పదని వైఎస్సార్‌సీపీ నేతలు స్పష్టం చేశారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ మండల కార్యాలయంలో వారు విలేకర్లతో మాట్లాడారు. జగనన్న బ్రాండ్‌తో గెలుపొంది, పదవి కోసం పార్టీ మారిన అమరనాథరెడ్డికి మంత్రి పెద్దిరెడ్డిని విమర్శించే నైతిక అర్హత లేదన్నారు. మంత్రి పదవి వెలగబెట్టిన సమయంలో రూ.కోట్ల విలువైన ఎస్‌ఈజెడ్ భూములను బినామీ పేర్లతో కాజేశారని తెలిపారు. సుమారు రూ.150 కోట్ల భూములను స్వాహా చేసి , కొబ్బరికాయలు కొట్టి.. శిలాఫలకాలు ఆవిష్కరించి.. అదే అభివృద్ధి అంటూ గొప్పలు చెప్పుకున్నారని విమర్శించారు. కర్ణాటకలో కియా కార్ల డీలర్ షిప్ తీసుకుని తాను మాత్రమే అభివృద్ధి చెందారని ఎద్దేవా చేశారు. ఇక ఎప్పటికీ గెలవలేమనే బెంగళూరులో వ్యాపారాలు ప్రారంభించారని, 2024 తర్వాత అమరనాథరెడ్డి వలస పోవడం ఖాయమని స్పష్టం చేశారు. లోకేష్ పాదయాత్ర సందర్భంగా బైరెడ్డిపల్లెలో టీడీపీ బ్యానర్లను వారే చింపేసుకుని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై నెపం నెట్టారని ఆరోపించారు. ఈ క్రమంలో ధర్మపురి సర్పంచ్‌తోపాటు వైఎస్సార్‌సీపీ దళిత కార్యకర్తపై దాడి చేయడం దాడి చేయడం సిగ్గుచేటన్నారు. రెచ్చగొట్టే చర్యలు మానకుంటే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, వైస్ ఎంపీపీ నారాయణస్వామి, సర్పంచులు కృష్ణారెడ్డి, రమణారెడ్డి, రాజప్ప, స్థానిక నేతలు జయకుమార్, కార్తీక్, నాగభూషణంరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రెడ్డెప్ప, వెంకటరమణ పాల్గొన్నారు.

పకడ్బందీగా రీసర్వే

శ్రీరంగరాజపురం : భూముల రీసర్వే ప్రక్రియను పకడ్బందీంగా పూర్తి చేయాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. శుక్రవారం మండలంలోని చిన్నతయ్యూరు, శెట్టివానత్తం, క్షీరసముద్రం గ్రామాల్లో శ్మశానవాటికల కోసం భూములను పరిశీలించారు. అనంతరం పుల్లూరు, చొక్కమడుగులో రీ సర్వే ప్రక్రియ తనిఖీ చేశారు. కనికాపురంలో అసైన్డ్ భూములను సందర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ దళితవాడలకు శ్మశాన వాటికలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వ నిర్ణయించిందన్నారు. ఇందుకోసం ఎక్కడికక్కడు భూమిని గుర్తించాలని సూచించారు. మండలంలో 22 మంది దళితులకు 13 ఎకరాల 85 సెంట్లు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జేసీ వెంకటేశ్వర్, తహసీల్దార్ షబ్బీర్‌బాషా, ఎంపీడీఓ కృష్ణయ్య పాల్గొన్నారు.



చిన్నతయ్యూరులో శ్మశానవాటికకు స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, జేసీ

ఎస్‌పీఎల్‌లో పరుగుల ప్రవాహం

- హోరెత్తిస్తున్న క్రికెటర్లు
- లీగ్ మ్యాచుల్లో గెలిచి ఫైనల్ బెర్త్‌పై గురి



తిరుపతి ఎడ్యుకేషన్ : సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో తిరుపతి సమీపం తుమ్మలగుంటలోని క్రికెట్ మైదానాల్లో నిర్వహిస్తున్న సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ పోటీల్లో పరుగుల ప్రవాహం కొనసాగుతోంది. పది ఓవర్ల మ్యాచ్‌లో బ్యాట్స్‌మెన్ భారీ లక్ష్యాలను ప్రత్యర్థి జట్టు ముందు ఉంచి సవాళ్లు విసురుతున్నారు. బౌలర్లు సైతం పదునైన బంతులతో వికెట్లు పడగొడుతూ జట్టును విజయపథంలో తీసుకెళుతున్నారు. ఇందులో భాగంగా నాలుగో రోజైన శుక్రవారం సీనియర్ విభాగంలో నిర్వహించిన 3 మ్యాచ్‌లలో 6జట్లు తలపడ్డాయి. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లో ఆల్‌రౌండర్లు చక్కటి ప్రదర్శన కనబరిచారు. లీగ్ మ్యాచ్‌లలో సత్తాచాటి ఫైనల్‌లో బెర్త్‌ను ఖరారు చేసుకునేందుకు శ్రమించారు.

గెలుపొందిన జట్లు ఇవే...

- మొదటి మ్యాచ్‌లో ఎస్వీయూ జట్టుపై రామాపురం ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాల జట్టు 8పరుగుల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఎమరాల్డ్స్ జట్టు 10ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 87పరుగులు చేసింది. తరువాత బ్యాటింగ్‌కు దిగిన ఎస్వీయూ జట్టు 10 ఓవర్లలో 3వికెట్ల నష్టానికి 79పరుగులు మాత్రమే చేసింది.
- రెండవ మ్యాచ్‌లో శ్రీపద్మావతి స్కూల్ ఆఫ్ ఫార్మసీ(ఎస్పీఎస్పీ) జట్టుపై ఎస్వీసీఈ-1 జట్టు 53పరుగుల తేడాతో విజయం అందుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఎస్వీసీఈ-1 జట్టు 10ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 103 పరుగులు చేయగా ఎస్పీఎస్పీ జట్టు 10ఓవర్లలో 8వికెట్లు కోల్పోయి కేవలం 50పరుగులు మాత్రమే చేసింది. ఈ మ్యాచ్‌లో ఎస్వీసీఈ-1జట్టు బ్యాట్స్‌మెన్ తరుణ్‌రాజ్ 42పరుగులతో నాటౌట్‌గా నిలిచి జట్టు విజయానికి కీలకపాత్ర పోషించాడు.
- మూడవ మ్యాచ్‌లో చదలవాడ ఇంజనీరింగ్ జట్టుపై శ్రీవిద్యానికేతన్ ఇంజనీరింగ్ జట్టు 8వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన చదలవాడ జట్టు 10ఓవర్లలో 6వికెట్లు కోల్పోయి 70పరుగులు చేయగా, తరువాత బ్యాటింగ్ చేసిన శ్రీవిద్యానికేతన్ జట్టు 7ఓవర్లలోనే 2వికెట్ల నష్టానికి 71పరుగులు చేసి విజయాన్ని అందుకుంది.

గెలుపొందిన జట్లు

- రామాపురం ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాల జట్టు
- ఎస్వీసీఈ-1 జట్టు
- శ్రీవిద్యానికేతన్ ఇంజనీరింగ్ కళాశాల జట్టు







విజయం సాధించిన రామాపురం ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాల, ఎస్వీసీఈ-1, శ్రీవిద్యానికేతన్ ఇంజనీరింగ్ కళాశాల జట్లు

వరసిద్ధుని సేవలో శైలజాచరణ్‌రెడ్డి



శైలజాచరణ్ రెడ్డి, కుటుంబసభ్యులను ఆశీర్వదిస్తున్న వేదపండితులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామిని మహిళా, శిశు సంక్షేమశాఖ రాయలసీమ జోనల్ చైర్మన్ శైలజాచరణ్‌రెడ్డి కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. వేదపండితులు ఆశీర్వదించి, తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు లోకేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓవరాల్ చాంప్ చిత్తూరు

- రెండో స్థానంలో విశాఖపట్నం
- ముగిసిన రాష్ట్ర స్థాయి పాలిటెక్నిక్ క్రీడలు



విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు చేతుల మీదుగా ట్రోఫీ అందుకుంటున్న విశాఖపట్నం క్రీడాకారులు



విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు చేతుల మీదుగా ట్రోఫీ అందుకుంటున్న ఓవరాల్ చాంపియన్ చిత్తూరు ఉమెన్ పాలిటెక్నిక్ క్రీడాకారులు

విజయవాడ స్పోర్ట్స్: పాలిటెక్నిక్ 25వ రాష్ట్ర స్థాయి గేమ్స్, స్పోర్ట్స్ మీట్ అట్టహాసంగా ముగిసింది. విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మూడు రోజుల పాటు కబడ్డీ, ఖోఖో, చెస్, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, అథ్లెటిక్స్ క్రీడాంశాల్లో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల నుంచి 1500 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో 53 పతకాలతో చిత్తూరు జిల్లా బాలికలు అగ్రస్థానంలో నిలవగా, రెండో స్థానంలో విశాఖపట్నం బాలురు 44 పతకాలతో నిలిచారు. చిత్తూరు జిల్లా బాలురు 43 పతకాలతో మూడో స్థానంలో, 26 పతకాలతో కృష్ణాజిల్లా బాలురు నాల్గో స్థానంలో, 25 పతకాలతో గుంటూరు జిల్లా బాలికలు ఐదో స్థానంలో నిలిచారు. అథ్లెటిక్స్ బాలుర వ్యక్తిగత విభాగంలో నెల్లూరు జిల్లా గూడూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు అత్యధిక పతకాలు సాధించగా, బాలికల వ్యక్తిగత విభాగంలో చిత్తూరు శ్రీ విద్యానికేతన్ కాలేజీ విద్యార్థినులు అత్యధిక పతకాలు కైవసం చేసుకున్నారు.

క్రీడలకు అత్యధిక ప్రాధాన్యత..

రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. పాలిటెక్నిక్ క్రీడల్లో విజేతలకు బహుమతులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో రాణించిన క్రీడాకారులను ప్రోత్సాహకాలను అందిస్తోందన్నారు. సాంకేతిక విద్యా శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఈ పోటీలను నిర్వహించిందన్నారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక విద్య సంయుక్త సంచాలకుడు పద్మారావు, సాంకేతిక విద్య బోర్డు కార్యదర్శి విజయభాస్కర్, సంయుక్త కార్యదర్శి జానకి రామయ్య, ఆర్‌జేడీలు జె.ఎస్.ఎన్.మూర్తి, నిర్మల్‌కుమార్‌ప్రియ పాల్గొన్నారు.

చిన్నారులకు అందిన భరోసా



సాక్షి ఎఫెక్ట్..

ప్రతిజ్ఞకు సరుకులు అందిస్తున్న సర్పంచ్ ప్రకాష్, సచివాలయ సిబ్బంది

నగరి : తల్లిదండ్రులు ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌లో ఉండటంతో చెల్లి, తమ్ముడు సంరక్షణ బాధ్యత తీసుకుని వారిని సంరక్షిస్తున్న విద్యార్థిని ప్రతిజ్ఞకు ప్రజాప్రతినిధులు, అధికారులు భరోసా కల్పించారు. ముడిపల్లి ఎస్టీ కాలనీకి చెందిన ప్రతిజ్ఞ మనోధైర్యాన్ని వెలుగులోకి తెస్తూ సాక్షి పత్రికలో గురువారం ప్రచురితమైన 'అమ్మానాన్నను మరిపిస్తూ.. అనురాగం కురిపిస్తూ..' కథనానికి పలువురు స్పందించారు. శుక్రవారం చిన్నారి ఇంటికి చేరుకున్న సర్పంచ్ ప్రకాష్ నిత్యావసర సరకులు అందజేశారు. సచివాలయ సిబ్బంది వెంటనే ప్రతిజ్ఞ కుటుంబానికి రేషన్ కార్డు మంజూరు చేయించారు. ఎప్పుడు ఏ అవసరం వచ్చినా తమను సంప్రదించాలని సర్పంచ్, సచివాలయ సిబ్బంది, వలంటీర్ ఫోన్ నంబర్ ఇచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి.సునీత, వెల్ఫేర్ అసిస్టెంట్ కాశీంవలీ, వీఆర్‌ఓ పూర్ణ చంద్ర, మహిళా పోలీస్ కళావతి, ఏఎన్‌ఎం భానుప్రియ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులతో ఉపాధ్యాయినులు

పెద్దపంజాణి: విశాఖపట్నం జిల్లా సింహాచలంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో జిల్లాకు చెందిన విద్యార్థినులు సత్తా చాటారు. మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల విద్యార్థినులు గ్రూప్‌స్థాయి హ్యాండ్‌బాల్ విభాగంలో మొదటిస్థానం, అథ్లెటిక్స్ గ్రూప్ ఈవెంట్‌లో రెండోస్థానం సాధించారు. పెద్దపంజాణి మండలం శంకర్రాయలపేట పాఠశాల విద్యార్థిని కె.జ్యోతిశ్రీ జావెలిన్ త్రోలో ప్రథమ స్థానం, 400, 200 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ, ద్వితీయ స్థానం, లాంగ్ జంప్‌లో ద్వితీయస్థానం, షాట్‌పుట్‌లో మూడోస్థానం సాధించి రాష్ట్రస్థాయి వ్యక్తిగత చాంపియన్ షిప్ కైవసం చేసుకుంది.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి



నవీన్ సజ్జన్ మృతదేహం

బంగారుపాళెం: స్థానిక ఎన్‌పీఎస్ కాలనీలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఏఎస్ మల్లప్ప శుక్రవారం తెలిపారు. వివరాలు.. చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి తిమ్మోజుపల్లె సమీపంలోని మధురం హోటల్‌లో నవీన్‌సజ్జన్ (30) అనే వ్యక్తి వంట మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన ఎన్‌పీఎస్ కాలనీలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. శుక్రవారం నవీన్ హోటల్‌లో పనికి రాలేదు. దీంతో హోటల్ ఓనర్ శరత్‌బాబు విషయం తెలుసుకునేందుకు నవీన్ ఇంటికి వెళ్లగా అప్పటికే మృతదేహంగా కనిపించాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనుమాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలు ఆత్మహత్య



మృతిచెందిన టి.సుబ్బమ్మ

మదనపల్లె : పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన వృద్ధురాలు జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. చిత్తూరుజిల్లా పుంగనూరు మండలం కొత్తపల్లెకు చెందిన టి.సుబ్బమ్మ(70) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. రెండురోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబసభ్యులు బాధితురాలిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు. ఆమె పరిస్థితి విషమంగా మారడంతో మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు సంతానం ఉన్నారు. పుంగనూరు పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేస్తున్నారు.

ఆక్రమిత భూమి స్వాధీనం



ఆక్రమిత భూమిలో చెట్లు తొలగిస్తున్న దృశ్యం

నగరి : మండలంలోని ఓజీ కుప్పం గ్రామంలో టీడీపీ నేతలు ఆక్రమించుకున్న ప్రభుత్వ భూమిని అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. అప్పాస్వామినాయుడు, ప్రేమ టీడీపీలో క్రియాశీలకంగా పని చేస్తున్నారు. వీరు 3.5 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారు. దీనిపై గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో అధికారులు సర్వే చేపట్టారు. కబ్జా నిజమని తేలడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి సదరు భూమిని స్వాధీనం చేసుకుని ఫెన్సింగ్ వేయించారు. అందులోని మామిడి, టేకు, కొబ్బరిచెట్ల తోపాటు వరి పైరును తొలగించారు.